# బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ధర్నా చౌక్ వద్ద వంట వార్పు



- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం...
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- మాజీ మంత్రి వనమా

**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 4, (ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం నిరసిస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్

మిగతా 2 లో...




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 5 | సెప్టెంబర్ | 2026 ♦ పేజీలు : 6




- అధికారుల కళ్ళ ముందే అక్రమ బహుళ అంతస్థుల జాతర..!
- అధికారుల అండతోనే బహుళ అంతస్థుల నిర్మాణాలు..!
- ఏజెన్సీ నిబంధనలు ఏమయ్యాయి? అంతస్తుల పై అంతస్తులు నిర్మిస్తుంటే అధికారులు మౌనం ఎందుకు..?
- అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు... తెరవెనుక భారీ వసూళ్లు..?
- చట్టం చుట్టంతోనే ఇష్టారాజ్యంగా అక్రమ భవనాలు...

# ఏజెన్సీలో చట్టాలకు తూట్లు

**భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ ప్రతినిధి/మణుగూరు,సెప్టెంబర్ 4,(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యాంగం కల్పించిన 5వ షెడ్యూల్ రక్షణలు,గిరిజనుల హక్కుల కోసం తెచ్చిన పటిష్టమైన పిసా-1996,వాల్టా చట్టాలు కాగితాలకే పరిమితం అయ్యాయంటే అవునేలా భవన అంతస్థుల దృశ్యాలు కనిపిస్తున్నాయి.గిరిజన చట్టాలు అమలు కాక అధికారుల కబంధ హస్తాలతోనే గిరిజన చట్టాలు అమ్ముడుపోతున్నాయనే విమర్శలు గిరిజన గూడాల్లో బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏజెన్సీలో ఒక్క గుడిసె వేసుకోవాలన్నా గ్రామసభ అనుమతి తప్పనిసరి. కానీ మణుగూరు ఏజెన్సీ ఏరియాలో మాత్రం సీన్ రివర్స్. ఎటువంటి అనుమతులు లేకుండానే,గ్రామసభ తీర్మానం లేకుండానే బడాబాబులు 3 నుండి 4 అంతస్తుల భారీ భవనాలను యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఇది కళ్ళుండి చూడలేని అధికారుల అసమర్థతా..? లేక వాటాల కోసం చేస్తున్న మౌన నాటకమా..? అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.సామాన్య గిరిజనుడు ఇల్లు కట్టుకోవాలంటే పంచాయతీ చుట్టూ,ఆర్డీవో చుట్టూ తిప్పుకునే అధికారులు, ఈ బహుళ అంతస్తుల భవనాలు లేస్తుంటే మాత్రం కళ్ళు మూసుకున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తు న్నారు. దీని వెనుక భారీ వసూళ్ల దందా జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.కొందరు బడాబాబులు ఏకంగా గిరిజనుల భూములను కబ్జా చేసి,వాటిపై విలాసవంతమైన భవనాలు నిర్మించారని,అడిగే నాథుడే

మిగతా 2 లో...

# భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



- దర్శన అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి
- రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి 276 కోట్ల నిధులు మంజూరు
- వచ్చే ఏడాది జూన్__ జూలై లో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు ఆలయ అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 4,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటన లో భాగంగా శుక్రవారం మంత్రి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి కి జిల్లా కలెక్టర్ అంకిత్ , ఐటీడీఏ పీవో రాహుల్ , పలువురు ఎమ్మెల్యేలు, ఘనంగా స్వాగతం పలికారు, దర్శనానంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు, అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారుల

మిగతా 2 లో...

# రోడ్డు గోతుల్లోనే ప్రజల ప్రాణాలు!

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు.
- . ఎన్నిసార్లు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం





**అశ్వాపురం,సెప్టెంబర్ 4, ప్రజాజ్యోతి**

అశ్వాపురం: మండల పరిధిలో అధ్వానంగా మారిన రహదారులు ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. రహదారులపై ఏర్పడిన గుంతలు, ప్రమాదకర మలుపులు, శిథిలమైన రోడ్ల కారణంగా నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజలు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నప్పటికీ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారుల దుస్థితిపై స్థానికులు, ప్రజా సంఘాలు, పత్రికల ద్వారా అనేకసార్లు

మిగతా 2 లో...

# సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో కొత్తగూడెం క్రీడాకారిణి రోడా గ్రేస్

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రోడా గ్రేస్





కేరళలో జరిగిన 17వ సౌత్ జోన్ రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ లో కొత్తగూడెం కు చెందిన క్రీడాకారిణి రోడా గ్రీస్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది, ఈ క్రీడాకారిని 10మీటర్ల ఎయిర్ రైఫిల్ బాలికల విభాగంలో , పి. రోడా గ్రేస్, అత్యుత్తమ ప్రదర్శన చేసి, 2026 డిసెంబర్ (ఢిల్లీ) లో జరగనున్న జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు అర్హత సాధించారు, రోడా గ్రేస్ కొత్తగూడెం శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం ప్రాంగణంలో 2025 జనవరిలో ప్రారంభమైన జిల్లా ఇండోర్ రైఫిల్ షూటింగ్ రేంజ్‌లో గత రెండు సంవత్సరాలుగా జిల్లా యువజన , క్రీడల అధికారి పరంధామ రెడ్డి పర్యవేక్షణలో క్రీడాకారులకు శిక్షణ అందుకుంటుంది, గత రెండు సంవత్సరాలుగా ఈ రేంజ్ నుంచి అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. గత సంవత్సరం ఆరుగురు రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్

మిగతా 2 లో...

## బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ధర్నా చౌక్ వద్ద వంట వార్పు

(మొదటి పేజీ తరువాయి...)



ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో గల ధర్నా చౌక్ వద్ద మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర ఆధ్వర్యంలో వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ,మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు , మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, మహిళా పథకాల అమలుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ముఖ్యంగా మహాలక్ష్మి పథకం (నెలకు ₹2,500 ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, ₹500లకే గ్యాస్ సిలిండర్) అమలు తీరుపై వారు నిరసన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.వీరితో పాటు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పలువురు బి ఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలు పాల్గొన్నారు

## సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లోకొత్తగూడెం క్రీడా కారిణి రోడా గ్రేస్



(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరును జాతీయ స్థాయిలో చాటిచెప్పారు.2025 రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫిల్ షూటింగ్ పోటీలలో హాస్పిటల్ సాధించి జాతీయ స్థాయిలో భోపాల్ పాల్గొన్నారు, ప్రస్తుతం 17వ సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లో ముగ్గురు బాలికా రైఫిల్ షూటర్లు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం జిల్లా షూటింగ్ క్రీడా రంగానికి ఎంతో గర్వకారణమని జిల్లా క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా పేరును జాతీయ స్థాయి వరకు తీసుకెళ్తున్న క్రీడాకారులను, వారికి నిరంతరం శిక్షణ అందిస్తున్న కోచ్ ఎం.డి. అబ్దుల్ నబీని, తమ పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను జిల్లా యువజన ,క్రీడల అధికారి పరంధామ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా జిల్లా షూటింగ్ రేంజ్‌లో శిక్షణ కార్యక్రమాలను మరింత పటిష్టం చేస్తామని ఆయన తెలిపారు.

## రోడ్డు గోతుల్లోనే ప్రజల ప్రాణాలు!

(మొదటి పేజీ తరువాయి...)

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావుడిగా స్పందించడం, అనంతరం సమస్యను మరిచిపోవడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడటంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, చిన్న వాహనాల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రజల ప్రాణాలకు సంబంధించిన సమస్యను అధికారులు ఇకనైనా తీవ్రంగా పరిగణించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారులను వెంటనే పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్డు భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# ఏజెన్సీలో చట్టాలకు తూట్లు

(మొదటి పేజీ తరువాయి...)

లేకపోవడంతో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాపోతున్నారు.అక్రమంగా వెలిసిన ఈ కట్టడాలను వెంటనే కూల్చివేసి, అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**గ్రామసభ తీర్మానం లేకుండానే నిర్మాణాలు...**

పిసా చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ముందుగా సంబంధిత గ్రామసభ తీర్మానం తప్పనిసరి.భూ బదలాయింపు, భూ వినియోగ మార్పిడికి గ్రామసభ ఆమోదం లేకుండా ఒక్క ఇటుక కూడా పేర్చకూడదు.అంతేకాకుండా వాల్టా చట్టం ప్రకారం భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకొని భవన అంతస్తులకు పరిమితులు ఉన్నాయి.అయితే ఈ చట్టాలను లెక్క చేయకుండా నే మణుగూరు పట్టణంలో జీ+3, జీ+4 భవనాలు వెలుస్తున్నాయి. వీటికి డీటీ మరియు సీపీ,పంచాయతీ, మున్సిపల్ అనుమతులు గానీ, గ్రామసభ తీర్మానం గానీ లేవని సమాచారం.అనుమతులు లేని వాటిని తక్షణమే ఏజెన్సీ చట్ట ప్రకారం



కూల్చివేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

**ముడుపుల మత్తులో అధికారులు...!**

ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు అక్రమ నిర్మాణాల పై కొందరు స్థానికులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ముడుపులు ముట్టాయి, అందుకే కళ్ళు మూసుకుని కూర్చున్నారనే వాదనలు చర్చనీయాంశంగా మారింది. కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాల గురించి అడుగుతుంటే అవి 'మా పరిధిలో లేదంటూ' మాట దాటేస్తూ తప్పించుకుంటున్నారని తెలుస్తోంది.పై స్థాయి అధికారులు నిలదీస్తే ఏదో నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, కూల్చివేతకు ఉత్తర్వులు ఇవ్వడం లేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.దీంతో అక్రమ నిర్మాణదారులకు భయం లేకుండా పోయిందని స్థానిక గిరిజనులు తమ గోడును వినిపిస్తున్నారు.

**పర్యావరణానికి, సంస్కృతికి ముప్పు...**

ఏజెన్సీ ప్రాంతంలో ఇష్టారాజ్యం గా జరుగుతున్న ఈ నిర్మాణాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, గిరిజన సంస్కృతి,జీవన విధానం దెబ్బతింటోందని గిరిజనులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఏజెన్సీ పట్టణాల్లో భవిష్యత్తులో తాగు నీటి కొరత తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఒకొక్క ఇంట్లో భారీ ఎత్తున పెద్ద బోర్లు వేశారని గిరిజనులు మొత్తుకుంటున్నారు. ఆ బోర్ల వల్ల ఇండ్లలో మంచినీరు కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**కూల్చివేయాల్సిందేనని గిరిజన సంఘాల హెచ్చరిక...**

చట్ట విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తులను వెంటనే కూల్చివేయాలని,అక్రమాలకు సహకరించిన అధికారులను సస్పెండ్ చేసి విచారణ జరపాలని ఐటీడీఏ,జిల్లా కలెక్టర్ పరిధిలోని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 5వ షెడ్యూల్ హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయించాలని లేకపోతే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి,ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గిరిజనులు కోరుతున్నారు.

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్...

- * ప్రజాజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు...
- * సురక్ష బస్టాండ్ వద్ద గుంతలు మాయం,తొలగిన మట్టి కుప్పలు...
- * ప్రజాజ్యోతి కథనం..అధికారుల స్పందన.. ప్రజలకు ఊరట...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 04,(ప్రజాజ్యోతి)...** ప్రజా సమస్యలపై ప్రజాజ్యోతి అస్త్రం పనిచేసింది.మణుగూరు సురక్ష బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చకుండా దుకాణాల ముందు మట్టి కుప్పలు వదిలేశారని, దుమ్ము ధూళితో ప్రజలు నరకం చూస్తున్నారని గురువారం ప్రజాజ్యోతి లో ప్రచురితమైన వార్త కథనానికి మణుగూరు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. గురువారం వరకు దాదాపు పది రోజులుగా అలాగే వదిలేసిన మట్టి కుప్పలను తొలగించి, ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను యాష్ కంకర మట్టితో పూడ్చి చదును చేశారు.దీంతో వాహనదారులు, వ్యాపారులు,పాదచారులు ఊపిరి పీల్చుకున్నారు.తమ సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రజాజ్యోతికి, స్పందించిన మున్సిపల్ అధికారులకు స్థానిక వ్యాపారులు,ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలపై ప్రజాజ్యోతి పోరాటం ఇలాగే కొనసాగాలని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజాజ్యోతి

04 Sep 2026 - Page 3

"గుంతలు పూడ్చడం మరిచారు.. మట్టి కుప్పలు వదిలేశారు"

- మణుగూరులో మున్సిపల్ అధికారుల నిర్లాక్షం..!
- దుకాణాల ముందే మట్టి కుప్పలు..పట్టించుకునే నాథుడేడీ..?
- సురక్ష బస్టాండ్ వద్ద మట్టి కుప్పలతో నరకం చూస్తున్న ప్రజానీకం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 03,(ప్రజాజ్యోతి) [illegible]



## భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



(మొదటి పేజీ తరువాయి...)

నుంచి అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్స్ ను, ఆర్కిటెక్చర్లను సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది ఏప్రిల్ లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలలోపు అన్ని పనులు పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదేవిధంగా వచ్చే ఏడాది 2027 జూన్ – జులై నెలలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రు. 276 కోట్ల నిధులు ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు.ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా, దశాబ్దాల కాలం పాటు నిర్మాణాలు ప్రతిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. దక్షిణాయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రం ఆలయ అభివృద్ధికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాలలో పాల్గొని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.భద్రాచలం ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి వెంట భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వరావుపేట పినపాక ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈవో దామోదర్, ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిపారవశ్యంతో మార్మోగిన రామాలయం

- సామూహిక వ్రతాలతో ఆధ్యాత్మిక శోభ
- సుమారుగా 100 మంది మహిళా భక్తులతో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజ
- వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా భక్తులకు చీరలు, గాజులు, అమ్మ వారి రూపు, పూజా సామగ్రి పంపిణీ





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):** శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో చివరి శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారుగా 100 మంది మహిళా భక్తులు ఏకకాలంలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళా భక్తుల సామూహిక వ్రతాలతో రామాలయం మొత్తం భక్తిపారవశ్యంతో నిండిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, మాజీ సర్పంచ్ బోడో పద్మ కూడా మహిళా భక్తులతో కలిసి వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన అమ్మవారి రూపు, పూజా సామగ్రిని మహిళా భక్తులకు అందజేశారు. వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులకు చీరలు, గాజులను కూడా అందించి ప్రత్యేకంగా సత్కరించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సీతారాముల కల్యాణం ప్రసాదాన్ని నున్న సుబ్బారావు, వెంకటరమణ జ్ఞాపకార్థం వారి కుమారులు నున్న బుజ్జి కృష్ణ కుటుంబ సభ్యులు స్పాన్సర్ చేయగా, భక్తులకు ప్రసాదాన్ని అందించారు.భక్తుల సౌకర్యార్థం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రామాలయ సేవా బృందం సభ్యులు తమ వంతు సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో రామాలయ సేవా బృందం సభ్యులు చిల్లపల్లి వెంకటేశ్వరరావు, బొంకూరి సురేష్, గుణగంటి శ్యామ్ కుమార్, నాగళ్ళ నరసింహారావు, గాజుల రాంబాబు, ఇజ్జగిరి సత్యనారాయణ, బొడ్డుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దగా పాలనకు వంటా-వార్పుతో సెగ

- మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం
- 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై మహిళల సమరభేరి



**ఇల్లందు, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెంది వెయ్యి రోజులు పూర్తి చేసుకొని రాష్ట్ర ప్రజానీకాన్ని దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల మోసపూరిత విఫల పాలనను నిరసిస్తూ ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సమర భేరి కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చిన బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇల్లందు పట్టణంలోని జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, పార్టీ శ్రేణులు వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ లు మాట్లాడుతూఎన్నికలకు ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చాక మాటల మాయాజాలంతో ప్రభుత్వాన్ని నడుపుతూ మహిళలను మోసం చేశారని ఎద్దేవా విమర్శించారు. మహిళల ఓట్లతో అధికారాన్ని దక్కించుకొని అదే మహిళల సంక్షేమాన్ని విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి మహిళకు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం హామీ ఎక్కడ అని, ఇప్పుడు తులం బంగారంతో పాటు పూర్తిగా కళ్యాణ లక్ష్మి పథకాన్ని కూడా ఎగవేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచుతామన్న పెన్షన్ల మొత్తం ఏమైందని ప్రశ్నించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని కాంగ్రెస్ దగా పాలనకు వ్యతిరేకం గా మొదలైన ఈ ప్రజా ఉద్యమం చల్లారదని 420 హామీల అమలు కోసం టిఆర్ఎస్ పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రజల కోసం ప్రశ్నించే గొంతుకగా మహిళల కోసం పోరాడే పార్టీగా టిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు ముందంజలో ఉంటుందని హెచ్చరిస్తూ మహిళలకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి, తిరిగి మహిళలే రాబోయే కాలంలో కచ్చితంగా సరైన గుణపాఠం చెప్పి తీరుతారని తెలిపారు. నాయకులు సిలివేరి సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, లకావత్ దేవిలాల్ నాయక్, ఎస్ రంగనాథ్, శీలం రమేష్, జెకె శ్రీను, కటకం పద్మావతి, తోట లలిత శారద, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ వంటావార్పు కార్యక్రమం



**చర్ల, సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని భద్రాచలం నియోజకవర్గ బీఆర్ ఎస్ నాయకుడు మానే రామకృష్ణ ఆరోపించారు. బీఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ ఆదేశాలతో చర్ల బీఆర్ ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద వంటావార్పు తో మహిళలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు పూర్తయినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన హామీలు, కేసీఆర్ కిట్, విద్యార్థినులకు స్కూటీలు, ప్రతి ఇంటి మహిళకు నెలకు రూ.2,500 అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండల కో-కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, కొంబత్తిన రాము, గోరింట్ల వెంకటేశ్వరరావు, అంబోజి సతీష్, తడికల బుల్లెబ్బాయి, కుప్పాల నిరంజన్, కుప్పాల సౌజన్య, పాసిగంటి సంతోష్, దుబ్బ సమ్మయ్య, తడికల చంద్రశేఖర్, కట్టం కన్నారావు, గాదంశెట్టి కిషోర్, కుక్కడప్పు సాయి, పాసిగంటి సంధ్య, మచ్చ రాణి , పెద్దమిడిసిలేరు సర్పంచ్ బెండబోయిన సుహాసిని, ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, కుదునూరు సర్పంచ్ కుంజా కమలతో పాటు పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు కేవలం దేవుడు కాదు జీవితాన్ని నేర్పిన జగద్గురువు- డైరెక్టర్ లిఖిత







**చర్ల, సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తేగడ గ్రామంలో గల శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. చిన్నారుల కోలాట నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్ని కృష్ణుల వేషధారణలో ఉన్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కేవలం పూజించే దేవుడు మాత్రమే కాదని, భగవద్గీత ద్వారా మానవాళికి జ్ఞానాన్ని అందించిన జగద్గురువని అన్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి జీవితం నుంచి నిష్కామ కర్మ, నిజమైన స్నేహం, కృతజ్ఞత, సమతుల్యత, ప్రకృతి–జీవరాసుల పట్ల ప్రేమ వంటి విలువలను నేర్చుకోవాలని సూచించారు.అలాగే గురుభక్తి, క్రమశిక్షణను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. సాక్షాత్తూ భగవంతుడైనప్పటికీ శ్రీకృష్ణుడు సాందీపని మహర్షి ఆశ్రమంలో సాధారణ విద్యార్థిలా విద్యాభ్యాసం చేసి గురువులను గౌరవించి క్రమశిక్షణతో మెలిగిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన శ్రావణిని డైరెక్టర్ లిఖిత అభినందించారు. అలాగే ఉపాధ్యాయులు పూజ, శ్రీదేవి, రాజేశ్వరి, శైలజ, అరుణ, ప్రమీల, రమేష్, స్వాతిలను అభినందించారు. పిల్లలను కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి కార్యక్రమానికి పంపించి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రావణి మాట్లాడుతూ చిన్ని గోపాలుడి రూపంలో ఉండే శ్రీకృష్ణుడు పిల్లలకు ఎంతో ఇష్టమని ఉట్టి కొట్టే సమయంలో చిన్నారుల ముఖాల్లో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలీస్ అభ్యర్థులకు 6న స్క్రీనింగ్ టెస్ట్

**చర్ల, సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షను సెప్టెంబర్ 6న నిర్వహించనున్నట్లు చర్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. చర్ల పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సెప్టెంబర్ 6న ఉదయం 7 గంటలకు చర్ల పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని సూచించారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తీసుకురావాలని తెలిపారు. చర్ల పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రానికి ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు అలాగే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చర్ల పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్క్రీనింగ్ పరీక్షకు తప్పనిసరిగా హాజరు కావాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- ఉట్టి కొట్టేందుకు ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు





**చర్ల, సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి )**శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చర్ల మండల కేంద్రంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్ల పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద గల గొల్లకట్ట వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.చర్ల గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఎంపీడీవో ఏదయ్య తదితరులు పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు, మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్టిని సొంతం చేసుకునేందుకు ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమంలో సందడి నెలకొంది.అనంతరం సాయంత్రం శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నృత్యాలు చేస్తూ, శ్రీకృష్ణ నామస్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నక్సల్స్ ఆయుధాల డంప్ స్వాధీనం

- 315 రైఫిల్, 41 కాట్రిడ్జ్ లు, డిటోనేటర్లు స్వాధీనం



**చర్ల , సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ):**నక్సల్ కార్యకలాపాల అవశేషాలను నిర్మూలించే లక్ష్యంతో నారాయణ్ పూర్ జిల్లాలో పోలీసులు, బీఎస్ ఎఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న గాలింపు చర్యల్లో భాగంగా హచెకోటి అటవీ ప్రాంతంలో పాత ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల డంప్ ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం ఎస్పీ సందీప్ పటేల్, 129వ బెటాలియన్ బీఎస్ ఎఫ్ కమాండెంట్ ముఖేష్ కుమార్ ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) అక్షయ్ సబ్ద్రా మార్గదర్శకత్వంలో మారుమూల ప్రాంతాల్లో సంయుక్త గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2న హచెకోటి అడవుల్లో భద్రతా బలగాలు గాలింపు చేపట్టగా అనుమానాస్పద ప్రదేశంలో నక్సల్స్ గతంలో దాచిన సామగ్రిని గుర్తించారు.స్వాధీనం చేసుకున్న వాటిలో తుప్పు పట్టిన, బట్ లేని ఒక .315 రైఫిల్, 16 .315 కాట్రిడ్జ్ లు, రెండు .303 కాట్రిడ్జ్ లు, నాలుగు 7.62 ఎంఎం కాట్రిడ్జ్ లు, ఒక 5.56 ఎంఎం కాట్రిడ్జ్, 18 12 బోర్ కాట్రిడ్జ్ లు ఉన్నాయి. మొత్తం 41 కాట్రిడ్జ్ లతో పాటు ఆరు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, రెండు కట్టల కమర్షియల్ కార్డ్ టెక్స్ ను స్వాధీనం చేసుకున్నారు.అదేవిధంగా నక్సల్ సాహిత్యం, ఫ్లెక్సిబుల్ వైర్, ఎల్ ఈడీ లైట్, రెండు పౌచ్ స్ట్రిప్ లను కూడా భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల పాత డంప్ ల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అంతర్గత ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నక్సల్ కార్యకలాపాల అవశేషాలను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఆపరేషన్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.హచెకోటి అడవిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల స్వాధీనం ముఖ్యమైన విజయంగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి. పోలీసు, బీఎస్ ఎఫ్ సంయుక్త బృందా లు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి అని అన్నారు.

# దండు సారయ్య స్వగృహంలో వరలక్ష్మీ వ్రతం

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కౌన్సిలర్ ఆకాంక్ష
- మహిళలకు వాయినాలు అందజేత











**ఇల్లందు, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ 13వా వార్డు కౌన్సిలర్, శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) స్వగృహంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఇంటిని శుభ్రంగా అలంకరించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. వరలక్ష్మీ అమ్మవారిని సుందరంగా అలంకరించి, పూజా సామగ్రితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అమ్మవారికి ప్రత్యేక అలంకరణ**

వరలక్ష్మీ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, పసుపు, కుంకుమ, ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వ్రత విధానాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి 13వ వార్డు కౌన్సిలర్, శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో వ్రతం**

వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు కు టుంబ సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరో గ్యం, సుఖసంతోషాల కోసం ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది.దండు సారయ్య స్వగృహంలో నిర్వహించిన వ్రత కార్యక్రమానికి మహిళలు హాజరై భక్తి శ్రద్ధల తో పూజలు నిర్వహించారు. వ్రతం అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందారు.

**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: దండు సారయ్య**

వరలక్ష్మీ అమ్మవారి కృపతో ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని 13వ వార్డు కౌన్సిలర్, శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత, శాంతి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేశారు.

**మహిళలకు వాయినాలు**

వ్రత కార్యక్రమం అనంతరం మహిళలకు సంప్రదాయబద్ధంగా వాయినాలు అందజేశారు. మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దింతో 13వ వార్డు కౌన్సిలర్, శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి) ఇంటి వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తులు, మహిళలు పాల్గొనడంతో వరలక్ష్మీ వ్రత కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. పూజా కార్యక్రమం అనంతరం మహిళలు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్లో పండుగలు, వ్రతాలకు ప్రత్యేక స్థానం ఉందని, వాటి ద్వారా కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత పెరుగుతుందని పలువురు పేర్కొన్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సంప్రదాయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

## వనవాసి నిలయానికి బియ్యం వితరణ

**చర్ల, సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ):**విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని గాదంశెట్టి ప్రసన్నలక్ష్మి అన్నారు. వస్త్ర వ్యాపారి గాదంశెట్టి నరసింహారావు–ప్రసన్నలక్ష్మి దంపతుల కుమారుడు నరసింహదేవ జన్మదినం సందర్భంగా శుక్రవారం చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం, శబరి బాలికా నిలయ విద్యార్థులకు 50 కిలోల బియ్యం, భోజనం, బిస్కెట్లు, పెన్నులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రసన్నలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీ చిన్నారులకు విద్యను అందించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి నిలయానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం లేదని కేవలం దాతల సహకారంతోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల నుంచి నేరుగా నగదు సేకరించకుండా వస్తు రూపంలోనే సహాయం పొందుతున్నట్లు వివరించారు. ప్రసన్నలక్ష్మి దంపతులు వివిధ సందర్భాల్లో విద్యార్థుల చదువులకు సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. పేద ఆదివాసీ విద్యార్థులపై వారు చూపుతున్న ప్రేమాభిమానాలు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు మంచిగా విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొమరం భీం నిలయ కమిటీ ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్‌బాబు, గాదంశెట్టి సుధారాణి, నంబూరి అశ్విని, లక్ష్మీ నర్సింహ, దివిత, లేక్ష్యశ్రీ, నిలయ ప్రముఖులు వరలక్ష్మి, సంతోష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



## చర్ల ఎంఈఓ రమణకు జిల్లా స్థాయి పురస్కారం



**చర్ల, సెప్టెంబర్ 04: (ప్రజా జ్యోతి ):**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో చర్ల మండల విద్యాధికారి (ఎంఈఓ) పి.వి. రమణకు జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిగా పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన అందించిన విశేష సేవలు, విద్యా ప్రమాణాల పెంపునకు చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు.37 సంవత్సరాలుగా విద్యాశాఖలో సేవలందిస్తున్న పి.వి. రమణ చర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయన ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో మండలం గణనీయమైన పురోగతి సాధించింది. అలాగే మండలంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపీ)లో చర్ల మండలం జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించడంలో ఆయన నాయకత్వం కీలకంగా నిలిచింది. పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడంతో పాటు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టారు. 'బడిబాట' వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి, డ్రాపౌట్లను తగ్గించేందుకు కృషి చేశారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల సమిష్టి సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని పి.వి. రమణ తెలిపారు. రాబోయే రోజుల్లో చర్ల మండలాన్ని విద్యారంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా ఉత్తమ ఎంఈఓగా పురస్కారానికి ఎంపికైన పి.వి. రమణను మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

# ఛలో ఐటీడీఏ పోస్టర్లు విడుదల



**చర్ల, సెప్టెంబర్ 04:(ప్రజా జ్యోతి ):** ఆదివాసీ హక్కులు, వనరుల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 7న ఏటూరునాగారం ఐటీడీఏ వద్ద నిర్వహించనున్న 'ఛలో ఐటీడీఏ–ఆదివాసీ మార్చ్'లో ఆదివాసీ యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసం ముసలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చర్లలో ఛలో ఐటీడీఏ వాల్‌పోస్టర్, కరపత్రాలను వారు విడుదల చేశారు.ఈ సందర్భంగా మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీ వనరులను ఆదివాసుల ఆర్థిక అభివృద్ధికి వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక, బొగ్గు, విద్యుత్, అటవీ సంపద, గోదావరి జలాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఆదివాసీ సమాజం అభివృద్ధికి దూరంగా ఉందని, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ హక్కులను పాలకులు హరిస్తున్నారని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టు, సీతమ్మసాగర్, పోలవరం ప్రాజెక్టుల పేరుతో గోదావరి జలాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని, ఆదివాసీ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆదివాసీ ప్రాంతంలోని ఇసుకను హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. 1/70 భూమి చట్టంపై గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆదివాసుల తరపున రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన కౌంటర్ దాఖలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.గోదావరి జలాలు, బొగ్గు, విద్యుత్, అటవీ సంపద, గోదావరి పరివాహక ప్రాంతంలోని సారవంతమైన భూములపై ఆదివాసులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రాచలంలోని ఐటీసీ కర్మాగారంలో ఆదివాసులకు ఉద్యోగ వాటా, 1976 ఎంఓ యూ ప్రకారం ఆదివాసుల వాటా నిధులు, కేటీపీఎస్, భూపాలపల్లి థర్మల్ పవర్ స్టేషన్, సింగరేణిలో ఆదివాసుల ఉద్యోగాలు, వాటా తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ఆదివాసీ ప్రాంతాల వనరులను దోచుకునే వారిపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసులను అభివృద్ధి చేయడం ప్రభుత్వాలకు చేతకాకపోతే గోదావరి పరివాహక ప్రాంతంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతాలను కలిపి ప్రత్యేక ఆదివాసీ రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం తుడుందెబ్బ చర్ల మండల నూతన కమిటీతో పాటు అనుబంధ ఆదివాసీ విద్యార్థి సంఘం కమిటీని ఎన్నుకున్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇర్పా ప్రకాష్ దొర, తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా పూనెం రవికిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోరం భిక్షపతి, ఉపాధ్యక్షులుగా తూర్రం ఆదినారాయణ, సోడి రవీంద్ర ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## తెలంగాణలో రెండోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే

- కాంగ్రెస్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ మాత్రమే బాధపడుతోంది
- ప్రతిపక్ష పాత్రలో బీఆర్ఎస్ ఫెయిల్..! ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి
- ధనిక తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు, (ప్రజాజ్యోతి):** రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రాబోతుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షులు పీరనాకి నవీన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ పార్టీ తప్ప రాష్ట్ర ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పూర్తిగా వైఫల్యం చెందిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించకుండా ఫామ్ హౌస్ కే పరిమితం కావడం సిగ్గుచేటని, ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోయినప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును టీఆర్ఎస్ హయాంలోనే నిర్మించారని, వారి హయాంలోనే ప్రాజెక్టు కూలిపోవడంతో పాటు వేల కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, గత ఎన్నికల్లో వచ్చిన సీట్లు కూడా రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు రావని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జోష్యం చెప్పారు.కవిత చేసిన సంచలన వ్యాఖ్యలపై కేటీఆర్,హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కవిత ఇంటి నుండి ఎందుకు బయటకు వెళ్లిందో, ఆమె చేసిన ఆరోపణల్లో వాస్తవమెంతో కేటీఆర్ ప్రజలకు వివరించాలన్నారు. తాము చేసిన తప్పులపై, అవినీతిపై సమాధానం చెప్పకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు నిరాధార విమర్శలు చేస్తున్నారని, కాంగ్రెస్ పై టీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి, మహిళా మండల నాయకురాలు సౌజన్య, నాయకులు దొబ్బల వెంకటపయ్య, శివ, జిల్లా నాయకులు పొలమూరి రాజు, సామా శ్రీనివాస రెడ్డి, గాండ్ల సురేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన పార్టీ శ్రేణులు

- బాసాని నాగేశ్వరరావును పరామర్శించిన చంద్రబాబు
- ముద్రగడ వంశీని అభినందించిన ఏపి ముఖ్యమంత్రి



**ఇల్లందు, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 1వా వార్డు నివాసి బాసాని నాగేశ్వరరావుకు గత నాలుగు నెలల క్రితం ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఒకసారి తీసుకురావాలని ముద్రగడ వంశీని ఆదేశించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని అమరావతి సచివాలయంలో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో తీసుకెళ్లి కలవడం జరిగింది. నాగేశ్వరరావు ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా రెస్ట్ తీసుకోవాలని పార్టీ అండగా ఉంటుందని, ఆర్థికంగా సహాయం చేస్తామన్నారు. పూర్తిగా బాధ్యత తీసుకొని ఎప్పటికప్పుడు పార్టీకి తెలియజేస్తూ పర్యవేక్షణ చేసినందుకు ముద్రగడ వంశీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నూతనంగా విజయలక్ష్మి నగర్ సర్పంచ్ రమేష్ బాబు, కామేపల్లి సర్పంచ్ అజ్మీర బుజ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందిస్తూ పార్టీలో కష్టపడి పని చేస్తే తప్పకుండా అవకాశం వస్తాయని ప్రజలకు బాధ్యతగా భావించి పనిచేయాలని ఎప్పుడు ప్రజాక్షేత్రంలో ఉండాలని సూచించారు. అనంతరం ముద్రగడ వంశీ మాట్లాడుతూ ఇంత ప్రత్యేకంగా సమయం ఇచ్చి కార్యకర్తతో మాట్లాడినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసే విధంగా దృష్టి సారించాలని చంద్రబాబును కోరారు. తప్పకుండా రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు కారు నర్సన్న, దాసరి గోపాలకృష్ణ, గోగేలా రాజేష్, బాసాని సుజాత, బాసాని నవీన్, బాసాని సాయి, తమానబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణుడి జన్మదిన వేడుకలు

- ఒట్టు కొట్టే సందడి.. ఆసుపాక-గుమ్మడవల్లి భక్తిమయం!"
- కృష్ణనామస్మరణతో మార్మోగిన గ్రామాలు..!
- భక్తులతో కిటకిటలాడిన వీధులు

**ఆసుపాక /గుమ్మడవల్లి, ప్రజా జ్యోతి ప్రతినిధి: సెప్టెంబర్ 4** శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ పురస్కరించుకొని ఆసుపాక, కుమ్మడవల్లి గ్రామాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. శ్రీకృష్ణుడి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా ఒట్టు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోనూ భక్తుల సందడి నెలకొని ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.ఉదయం నుంచే గ్రామ ప్రజలు, చిన్నారులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా జరిపారు. సంప్రదాయానికి ప్రతీకగా నిర్వహించిన ఒట్టు కొట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా పలువురు తరలివచ్చినట్లు సమాచారం.భక్తులతో కోలాహలంగా గ్రామాలుజన్మాష్టమి వేడుకల సందర్భంగా ఆసుపాక, కుమ్మడవల్లి ప్రాంతాలు భక్తులతో కోలాహలంగా మారాయి. కృష్ణనామస్మరణలు, ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలకు ప్రత్యేక శోభ సంతరించుకుంది.తరతరాల సంప్రదాయానికి ప్రతీకఒట్టు కొట్టే కార్యక్రమం కేవలం వినోదం మాత్రమే కాకుండా, గ్రామీణ సంప్రదాయాలు, ఐక్యతను ప్రతిబింబించే వేడుకగా నిలిచింది. పాతతరం నుంచి వస్తున్న ఆచారాలను నేటి తరానికి పరిచయం చేస్తూ గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ వేడుకకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చింది.భక్తిశ్రద్ధలతో ఘన నిర్వహణపండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు ఆసుపాక, గుమ్మడవల్లి గ్రామాల్లో భక్తి, సంప్రదాయం, ఉత్సాహం కలగలిపిన ఆధ్యాత్మిక సందడిని సృష్టించాయి.కృష్ణుడి నామస్మరణలతో మార్మోగిన వీధులు..ఒట్టు కొట్టే వేడుకతో ఉప్పొంగిన యువత..భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన గ్రామ ప్రజలు..ఆసుపాక–గుమ్మడవల్లిలో జన్మాష్టమి వేడుకలు..!





## పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 4,(ప్రజా జ్యోతి )** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాథపురం గ్రామంలో కొలువు తీరిన పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం మాదిరిగా వైభవంగా పంచామృతాలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు, ముందుగా మేల తాళాలతో ఆలయ అర్చకులు ,భక్తులు జన్మ స్థలం వద్ద అమ్మవారికి పంచామృతాలు, పసుపు ,కుంకుమ, గాజులు ,హారతి సమర్పించిన అనంతరం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్ కు పంచామృతాలతో ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించారు, అనంతరం పంచహారతులు, నివేదన ,నీరాజన, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆసుపత్రిని సీజ్ చేసి...రూ.కోటి పరిహారం అందించాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**ములకలపల్లి సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** మండలంలోని చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబ సభ్యులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం పరామర్శించారు. శిరీష చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ వంటి మహానగరాల్లో మహిళలకు రక్షణ కరువైందనడానికి శిరీషపై జరిగిన ఘటన మరోసారి నిదర్శనమన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష పనిచేసిన ఆస్పత్రిలో సరైన వసతులు, భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఈ దారుణ ఘటన జరిగిందని ఆరోపిస్తూ, సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ తరఫున శిరీష దశదిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ గణేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి ఎండీ యూసుఫ్, నరాటి రమేష్, ఉపసర్పంచ్ పువ్వాల లలితారావు, జబ్బార్, అనుమాల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జెండాలు తొలగిస్తారా...?

- అధికారుల తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం..
- పోలీసులకు ఫిర్యాదు




**ములకలపల్లి సెప్టెంబర్ 04 (ప్రజాజ్యోతి):** ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాలను అధికారులు తొలగించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా గురువారం నిర్వహించిన రైతు సదస్సు సందర్భంగా డివైడర్‌పై జెండాలు ఏర్పాటు చేయగా అధికారులు తొలగించారని బీఆర్ఎస్ మండల కమిటీ ఆరోపించింది. దీంతో శుక్రవారం జెండాలను తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేసి అధికారుల తీరును ఖండించారు. అధికారులు ప్రజల కోసం పనిచేయాలే తప్ప నాయకుల మెప్పు కోసం కాదని, ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయని, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, సర్పంచులు తుర్రం శ్రీనివాస్, భూక్య ధర్మ, మాజీ ఎంపీపీ మట్ల నాగమణి, పుల్లారావు, కోమరయ్య, శనగపాటి సీతారాములు, కొండవీటి రాజారావు, పుష్పాల సాయి, పుష్పాల చంద్రరావు, ఉరబెద్ది వెంకన్న, తాటి రవి, పూరేటి నరసింహారావు, పద్దం వెంకటేశ్వరరావు, పాలగాని చెన్నకేశవులు, బొర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శిరీష హత్యకు బాధ్యులెవరైనా వదలం

- శిరీషకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం
- ఆస్పత్రి, హాస్టల్ పైనా సమగ్ర విచారణ: మంత్రి పొంగులేటి
- రూ.5 లక్షల చెక్కు, ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ అందజేత





**ములకలపల్లి సెప్టెంబర్ 04, (ప్రజాజ్యోతి):** గిరిజన యువతి ఊకే శిరీష హత్య ఘటనలో బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శిరీషకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని, నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి.. ఆమె తల్లి రామలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఉపాధి కోసం హైదరాబాద్ కు వెళ్లి స్టాఫ్ నర్సుగా పని చేస్తూ కుటుంబానికి అండగా నిలవాలనుకున్న శిరీష దారుణ హత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సాయం చెక్కుతో పాటు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ ను కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శిరీష హత్యకు గురైన అంశంపై సీపీతో కుటుంబ సభ్యుల సమక్షంలో ఫోన్ లో మాట్లాడారు. శిరీష ఉం టున్న వసతి గృహాన్ని తక్షణమే తనిఖీ చేసి, ఆస్పత్రికి అనుసంధానమైన హాస్టల్ లో భద్రతా ఏర్పాట్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే ఆస్పత్రిని సీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ ఐఆర్ లో ఆస్పత్రి, వసతి గృహానికి సంబంధించిన వ్యక్తులను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించిన మంత్రి.. అవసరమైతే అదనంగా ఎఫ్ ఐఆర్ నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి పరామర్శకు వచ్చిన సమయంలో శిరీష తల్లి రామలక్ష్మి కన్నీటితో "నాకు ఎలాంటి సహాయం వద్దు.. నా బిడ్డకు న్యాయం చేయండి" అంటూ పొంగులేటిని వేడుకున్నారు. తల్లి ఆవేదన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఐటీడీఏ పీవో రాహుల్, హౌసింగ్ పీడీ సవయ్ రామ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ములకలపల్లి తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపిడిఓ ఎస్ వి సత్యనారాయణ, ఆర్ ఐ లు సత్యవతి, రాంబాబు, ప్రజాప్రతినిధులు, కుంజా రాంబాబు, కోర్స చంద్రలేఖ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, జిల్లా నాయకుడు బత్తుల అంజి, గాడి తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, మడకం చిరుమప్ప, సురభి రాజేష్, పాలకుర్తి రత్నభూషణం, పాలకుర్తి రవి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్

**ములకలపల్లి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి):** ముర్రేడు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో వాగు వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాల్వంచలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు







**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 4,(ప్రజా జ్యోతి)** కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని పాల్వంచ పట్టణంలోని పలు సెంటర్లలో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్లో, నవభారత్ సెంటర్లో ,ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో చిన్నారులు కృష్ణుడి వేషధారణతో ఉత్సాహంగా పాల్గొని పుట్టి కొట్టారు, పెద్దలు మహిళలు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని నీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమా న్ని విజయవంతం చేశారు ఉట్టి కొట్టే కార్యక్రమానికి వచ్చిన కుంకం తేజేష్ శౌ ర్య, విష్ణువర్ధన్ శౌర్యలు వేసిన శ్రీకృష్ణుడి వేషధారణలు పలువురుని ఆకట్టుకున్నాయి.

## కృష్ణాష్టమి వేళ బాలాజీ, మల్లికార్జున ఆలయాల్లో విశేష పూజలు

- శ్రీకృష్ణ పరమాత్మకు అభిషేకాలు.. శుక్రవారం సందర్భంగా కుంకుమ పూజలు





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):** కృష్ణాష్టమి, శుక్రవారం పర్వదినాలను పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృత అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానంలో ఆలయంలోని గోపాలకుడు కృష్ణ పరమాత్మకు విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. రెండు ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.